సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 2 । నవంబర్ । 2024



దళిత యువకులపై దాడి


సినిమా థియేటర్‌లో పార్క్ చేసిన బైక్ పడిపోవడంతో తలెత్తిన స్వల్ప వివాదం కొట్లాటకు దారి తీసింది. ఆగ్రహించిన అగ్రవర్ణాల వారు దళితులపై దాడికి దిగి ఇద్దరిని బలవంతంగా తమ స్వగ్రామానికి తీసుకువెళ్లి గుడిలో నిర్బంధించారు. 8లో



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి కర్రి చిన్నభద్రారెడ్డి, రమాశైలజ (రావులపాలెం) దంపతులు శుక్రవారం రూ.1,01,116 విరాళం అందించారు.

సముద్రంలోకి 40 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శుక్రవారం సాయంత్రం 40,357 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద 8.70 అడుగులకు నీటిమట్టం చేరింది. తూర్పు డెల్టాకు 1,100, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ఆదర్శప్రాయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్



సమైక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్: జాతి ఐక్యత కోసం కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు పిలుపునిచ్చారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం పటేల్ జయంత్యుత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఎస్పీతో పాటు ఏఎస్పీ ప్రసాద్, ఎస్పీ కార్యాలయం సీఐలు, ఎస్సైలు, సిబ్బంది సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు, స్పెషల్ బ్రాంచి సీఐలు బి.రాజశేఖర్, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతి ఐక్యతకు పునాదులు



కలెక్టరేట్‌లో పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వరరావు

అమలాపురం రూరల్: జాతి ఐక్యతకు, ప్రజల మధ్య సోదర భావాన్ని పెంపొందించడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ పునాదులు వేశారని కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. పటేల్ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించి సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. పటేల్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పటేల్ మొదటి హోంమంత్రి, మొదటి ఉప ప్రధానమంత్రిగా పని చేశారన్నారు. స్వాతంత్ర్యానంతరం భారత రాష్ట్రాల ఏకీకరణలో పటేల్ కీలక పాత్ర పోషించారన్నారు. కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, భూసేకరణ ఉప తహసీల్దార్ ఏసుబాబు పాల్గొన్నారు.

రహదారులపై గుంతలు పూడ్చేందుకు చర్యలు



రాము, ఆర్‌అండ్ బీ ఇంజినీర్

అమలాపురం రూరల్: జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారులపై గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా రహదారులు, భవనాల శాఖ ఇంజినీర్ బి.రాము తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రూ.18 కోట్ల నిధులతో 71 పనులకు ఆమోదం లభించిందని, వాటిని శనివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. మరో 72 పనులకు రూ. 20 కోట్లు వారం రోజుల్లో మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. పి.గన్నవరం మండలం పోతవరంలో కలెక్టర్ మహేష్ కుమార్ శనివారం ఉదయం 11:30 గంటలకు ప్రారంభిస్తారన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: రామచంద్రపురం మండలం తోటపేటలో ఆ గ్రామ ఎంపీటీసీ భర్త, జనసేన పార్టీకి చెందిన అల్లం వెంకట రమణ (చంటి)కి చెందిన వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం రామచంద్రపురం సీఐ కడియాల అశోక్ కుమార్, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన రహదారిపైనే గల వాటర్ సర్వీసింగ్ సెంటర్ వెనుక రెండు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే పోలీసులు దాడి చేసిన వెంటనే జనసేన పార్టీకి చెందిన ముప్పనపల్లి గణేష్ రావడం, ఆ తరువాత అక్కడ పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. శిబిరం నిర్వహిస్తున్న సూత్రదారులపై కేసు నమోదు చేయకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంఘటనా స్థలం వద్ద రూ.25,470 స్వాధీనం చేసుకున్నామని, 14 మంది జూదరులను అదుపులోకి తీసుకుని కోర్టు లో హాజరు పరిచినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో ద్రాక్షారామకు చెందిన దాసరి మురళీమోహన్, శీలకు చెందిన దొమ్మేటి వెంకట సుబ్బారావు, కుయ్యేరుకు చెందిన దూడల వీరవెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, కాకినాడకు చెందిన వలసాని కాశీ సిద్ధికృష్ణ, పట్నాల వెంకటేశ్వరరావు, వెలంపాలేనికి చెందిన కర్రి నాగేశ్వరరావు, కర్రి వెంకన్నబాబు, పురంశెట్టి రాంబాబు, రామచంద్రపురానికి చెందిన వెదుళ్ల వీరగణపతి చౌదరి, పటవలకు చెందిన దంగేటి సాయికృష్ణ, జగన్నాయకులపాలెంకు చెందిన లకం శ్రీను, పళని సురేష్, వేళంగికి చెందిన షేక్ రహ్మాన్ ఉన్నారు.

కార్తికం.. కమనీయం

- జిల్లాలో ఆధ్యాత్మిక శోభ
- ముస్తాబైన శైవ క్షేత్రాలు, విష్ణు ఆలయాలు
- నేటి నుంచి పవిత్ర మాసం ప్రారంభం



ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



కోటిపల్లి క్షేత్రం వద్ద కొలనులో కొలువైన పరమేశ్వరుడు

సాక్షి నెట్‌వర్క్: పరమేశ్వరుడు, మహావిష్ణువులకు ప్రీతికరమైన కార్తికమాసం ప్రారంభమైంది. పౌర్ణమి రోజు కృత్తిక నక్షత్రం అనగా చంద్రుడు కృత్తిక నక్షత్రంతో కలిసిన రోజున ఈ మాసం మొదలవుతుంది. పూజలు, అభిషేకాలు, వ్రతాలు, అయ్యప్ప, ఇతర దేవుళ్ల మాలధారణలు.. ఇలా ఈ నెల రోజులూ జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మికత పరవళ్లు తొక్కనుంది. ఈ మాసంలో ప్రతి సోమవారం ప్రధానంగా శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తనున్నారు. అందుకు తగినట్టుగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలను ముస్తాబు చేశారు.

ఒక్కరోజు ఆలస్యం

దీపావళి మరుసటి రోజున ప్రారంభమయ్యే కార్తికమాసంలో శివ పరమాత్ముడికి పూజలు నిర్వహించడం పరిపాటి. ఈ ఏడాది అమావాస్య తిథులు మిశ్రమంగా ఉండటంతో కార్తిక మాసం ఒక రోజు ఆలస్యంగా శనివారం ప్రవేశించింది. మార్గశిర మాసం విష్ణుమూర్తికి, కార్తికం శివునికి ప్రీతికరమని పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్నాయి. ఈ నెలలో శివాలయాలకు వెళ్లే భక్తులే అధికంగా ఉంటారు. భక్తి శ్రద్ధలతో శివుడిని ఆరాధిస్తే సకల సౌఖ్యాలు సిద్ధించి అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. నాగుల చవితి, క్షీరాబ్ధి ద్వాదశి, కార్తిక పౌర్ణమితో పాటు ఈ మాసంలో వచ్చే నాలుగు సోమవారాలు, రెండు ఏకాదశి పర్వదినాలను శివభక్తులు పుణ్యప్రదంగా భావిస్తారు.

పూర్తయిన ఏర్పాట్లు

కార్తిక మాసం మొదలవుతున్న నేపథ్యంలో జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. వీటితో పాటు విష్ణు ఆలయాలు, ఇతర ప్రముఖ దేవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల రోజులు అన్న సమారాధన, వన సమారాధనల సందడి నెలకొంటుంది. ప్రసిద్ధ శివాలయాల్లో హోమాలు, బిల్వార్చనలు, లక్ష తులసి దళ పూజలు నిర్వహించేందుకు దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

మురమళ్ల వీరేశ్వరుని ఆలయం



మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

వృద్ధ గౌతమీ నదీ పాయను ఆనుకుని ఐ.పోలవరం మండలం మురమళ్లలో కొలువైన వీరేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. ఈ ఆలయం నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతోంది. ఇక్కడ స్వామివారికి కల్యాణం చేయిస్తే.. పెళ్లి కాని వారికి వివాహం అవుతుందని భక్తుల నమ్మకం. ఆలయంలో కార్తిక మాస మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రూ.మూడు వేలు చెల్లిస్తే నెల రోజులు స్వామివారి నిజరూప లింగానికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు.

భీమేశ్వరాలయం



మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి

దక్షిణ కాశీగా, పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయం కార్తిక మాసంలో ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలో ఉన్న ఈ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరిలో భక్తులు స్నానమాచరించి భీమేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మాణిక్యాంబ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తారు.

పలివెల ఉమాకొప్పేశ్వర క్షేత్రం



ఉమా కొప్పేశ్వరస్వామి

కొత్తపేట మండల పరిధిలోని పలివెల గ్రామంలో ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రానికి పురాతన చరిత్ర ఉంది. అగస్త్య మహాముని తపస్సు ఫలితంగా శివపార్వతులు ఏకపీఠంపై కొలువుదీరినట్లు స్థల పురాణంలో పేర్కొన్నారు. ఆలయంలో పరమ నిష్టాగరిష్టుడైన పూజారి ప్రాణాలు నిలిపేందుకు పరమశివుడు కొప్పును ధరించినట్లు చెబుతారు. అందుకే ఇక్కడ శివలింగానికి ముందు భాగంలో కొప్పు ఉంటుంది. ఆలయాన్ని దేవతలు నిర్మించాలని ప్రతీతి. అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తరిస్తుంటారు.

కుండలేశ్వరుని దర్శనం

గౌతమీ నదిలో స్నానం చేసి కుండలేశ్వరుని దర్శించుకోవడం ద్వారా అనంత కుండలాల ఫలం వస్తుందని బ్రహ్మపురాణంలో నారద మహామునికి బ్రహ్మ దేవుడు చెప్పాడని భక్తుల నమ్మకం. కాట్రేనికోన మండలం శివారు కుండలేశ్వరంలోని కుండలేశ్వరుడి శివలింగం కుండలం (చెవి కుండలం) ఆకారంలో ఉంటుంది. నదిలో పుణ్యస్నానం ఆచరించి కుండలేశ్వరుని దర్శించుకున్న వారిలో నారదుడు, మార్కండేయుడు, శంకరాచార్యులు, శ్రీనాథుడు తదితరులున్నారని చెబుతుంటారు. ఈ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారు.



కోటిపల్లి రాజరాజేశ్వరి సమేత ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం

కోటి ఫలాలు అందించే కోటిపల్లి

గౌతమీ గోదావరి చెంతనే ఉన్న కోటిపల్లి రాజరాజేశ్వరీ సమేత ఛాయా సోమేశ్వర స్వామిని దర్శిస్తే కోటి ఫలాలు అందుతాయని భక్తుల విశ్వాసం. కోటి కన్యాదానాల ఫలం, నూరు అశ్వమేధ యాగాల ఫలం, కోటి శివలింగాలు ప్రతిష్ఠ చేసిన పుణ్యఫలాన్ని ఇచ్చేది ఈ క్షేత్రం. పక్కనే ఉన్న గోదావరిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఆలయానికి సైతం భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.

ముక్తిని ప్రసాదించే ముక్తేశ్వరుడు



ముక్తేశ్వరంలో ముక్తికాంత క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయం

త్రేతాయుగంలో స్వయంగా శ్రీరామచంద్రమూర్తి ప్రతిష్ఠించిన ఆలయంగా ముక్తికాంత క్షణ ముక్తేశ్వరస్వామి దేవాలయం ప్రసిద్ధి చెందింది. ఇక్కడి స్వామివారిని దర్శించుకుంటే క్షణంలో ముక్తిని ప్రసాదిస్తారని భక్తుల నమ్మకం. కోటిపల్లి వచ్చే భక్తులు ముక్తేశ్వరం రేవు దాటి ఇక్కడ ఆలయానికి వస్తుంటారు. ప్రతి సోమవారం భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.



కుండలేశ్వరస్వామి

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

- క్రీడాకారులకు అన్ని విధాలా సహకారం
- కలెక్టర్ మహేష్ కుమార్



ఛారిష్మ, కుమార్ చంద్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈవో సలీం బాషా

అమలాపురం రూరల్: అంతర్జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణించాలన్నదే తన ఆకాంక్ష అని, ప్రతిభావంతులైన క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో జరిగే వివిధ క్రీడాపోటీలకు ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అభినందించారు. ఇటీవల మార్టేరులో జరిగిన అండర్-15 బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొని జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపికైన అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిమ్మకాయల ఛారిష్మ సాయిరుత్వి, అండర్-14 స్కేటింగ్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.కుమార్ చంద్ శ్రీధర్‌ను ఆయన అభినందించారు. ఛారిష్మ గతంలో జాతీయ స్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ఐకి రెండుసార్లు, సబ్ జూనియర్స్‌కు ఒకసారి రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారని డీఈవో వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో మరింతగా రాణించి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. డీఈవో సలీం భాషా, క్రీడాభారతి ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, పీడీ కె.ఆదిలక్ష్మిలు అంబాజీపేట ఉన్నత పాఠశాల మైదానంలో బాస్కెట్‌బాల్ సిమెంట్ కోర్టు నిర్మాణం చేయాలని కోరారు. పాఠశాలలో మట్టి కోర్టు మాత్రమే ఉందని, అక్కడే సాధన చేసి ఇప్పటి వరకు తొమ్మిది మంది బాలికలు జాతీయ, అంతర్ యూనివర్సిటీ క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. బాస్కెట్ బాల్ సిమెంట్ కోర్టు నిర్మిస్తే మరింత మంది రాణించే అవకాశం ఉందని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీవైఈవోలు మధుసూదన రావు, సూర్య ప్రకాశం, స్కూలు హెచ్ఎం కామేశ్వరరావు, పీడీలు పి.సతీష్, కె.ఆదిలక్ష్మి, క్రీడాభారతి ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), మాజీ హెచ్ఎం జొన్నలగడ్డ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. లబ్ధిదారుల పరేషాన్

- పింఛన్ల పంపిణీకి అంతరాయం
- కార్యాలయాల వద్ద ప్రజల నిరీక్షణ



మామిడికుదురు పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

ఆలమూరు: సర్వర్లు డౌన్ కావడంతో పింఛన్ల లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. మళ్లీ ఎప్పుడు పనిచేస్తుందోనంటూ పడిగాపులు కాశారు. వివరాల్లోకి వెళితే.. కూటమి నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది సామాజిక పింఛన్ల పంపిణీని శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో ప్రారంభించారు. లబ్ధిదారులకు సొమ్ములు ఇవ్వడం మొదలు పెట్టారు. సుమారు 8.47 గంటలకు సర్వర్ డౌన్ కావడంతో పంపిణీ నిలిచిపోయింది. దీంతో పింఛన్లను పంపిణీ చేసే గ్రామ సచివాలయ సిబ్బంది వెనుదిరిగి కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అప్పటి వరకూ కేవలం 47.8 శాతం మాత్రమే పింఛన్ల పంపిణీ జరిగింది.

సచివాలయాలకు లబ్ధిదారులు

పింఛన్ల పంపిణీ నిలిచిపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. వెంటనే గ్రామ సచివాలయాలకు చేరుకుని కారణమేమిటని ఆరా తీశారు. సర్వర్ డౌన్ అయ్యిందని, బాగయ్యాక పంపిణీ చేస్తామని సచివాలయం ఉద్యోగులు బదులు చెప్పారు. అయితే కొందరు లబ్ధిదారులు భోజనానికి కూడా వెళ్లకుండా అక్కడే ఉండిపోయారు. పింఛన్ల పంపిణీ చేసే సర్వర్ ఎట్టకేలకు మధ్యాహ్నం 2.43 గంటల నుంచి పనిచేయడం ప్రారంభించింది. దీంతో గ్రామ సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి పింఛన్ల పంపిణీని పునఃప్రారంభించారు. సాయంత్రం ఆరు గంటలకు 93.7 శాతం పంపిణీ చేశారు. జిల్లాలోని 22 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో 2,39,368 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వారికి ప్రతినెలా రూ.99,44,08,500 పంపిణీ చేస్తున్నారు.

కారణమిదేనా!

పింఛన్ల పంపిణీలో కీలక పాత్ర వహించే డివైజ్‌లకు గడువు ముగిసినా రీచార్జి చేయించకపోవడంతో సక్రమంగా పనిచేయడం లేదని సమాచారం. గతంలో ప్రతి గ్రామ వలంటీర్‌కు ఒక డివైజ్ చొప్పున పంపిణీ చేయడంతో పాటు నిర్దిష్ట సమయంలో అప్పటి ప్రభుత్వం రీచార్జి చేయించేది. అలాగే భావి అవసరాల దృష్ట్యా ప్రతి గ్రామ సచివాలయానికి అదనంగా రీచార్జి చేసిన ఐదు వరకూ డివైజ్‌లు అందుబాటులో ఉండేవి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ గడువు ముగిసిన డివైజ్‌లకు రీచార్జి చేయించలేదని తెలుస్తోంది. సాధారణంగా జిల్లాలో ఏసీపీఎల్ ఎఫ్ఎం 220 మోడల్‌కు చెందిన డివైజ్‌లను ప్రభుత్వం వినియోగిస్తోంది వాటికి ఏటా రూ.260తో మొబైల్ మాదిరిగా అందులో ఉన్న సీరియల్ నెంబరుతో రీచార్జ్ చేయాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ రీచార్జి చేయించపోవడంతో అనేక డివైజ్‌లు మూలన పడ్డాయని తెలుస్తోంది. పింఛన్ల పంపిణీలో జాప్యానికి కూడా డివైజ్‌ల రీచార్జీలు కూడా కారణంగా ఉంది.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



అమలాపురంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఆ సంస్థ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం అమలాపురంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమితి అధ్యక్షుడు కె.సత్తిబాబు, కోనసీమ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సత్తిబాబు మాట్లాడుతూ ఏఐటీయూసీ దేశ వ్యాప్తంగా పలు రంగాల కార్మికులు, కర్షకులకు అండగా నిలిచిందని, వారి హక్కులపై పోరాటాలు, ఉద్యమాలు చేసి విజయాలు సాధించిందన్నారు. తొలుత గడియారం స్తంభం సెంటర్ సమీపంలోని జానకి రామర్స్ కల్యాణ మండపంలో వేడుకలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు రంగాల కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఎర్ర జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణ, ఆర్టీసీ బస్ స్టేషన్ ఏరియా, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణ, హైస్కూలు, గడియారం స్తంభం సెంటర్లలో కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, ఆటో, జట్టు లేబర్, అసంఘటిత రంగ కార్మికులకు న్యాయం చేయాలని, జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు, ఆంధ్ర ఆటోవాలా జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్, మున్సిపాలిటీల క్లాప్ ఆటో టిప్పర్ల డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ కుమార్, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రతినిధులు హారతి, వి.సుబ్బారావు తదితరులు ప్రసంగించారు.

నేడు టీఎన్ఏఐ ద్వైవార్షిక సమావేశం

కాకినాడ క్రైం: ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ ద్వైవార్షిక సమావేశం శనివారం కాకినాడలో జరగనుంది. ఈ మేరకు, ఆంధ్రప్రదేశ్ నర్సెస్ అండ్ మిడ్ వైవ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్, అసోసియేషన్ సెక్రటరీ ప్రొఫెసర్ కె.సుశీల వివరాలు వెల్లడించారు. కాకినాడలోని వివేకానంద పార్కు సమీపంలో ఉన్న హోటల్ ఫ్యాబిన్‌లో జరగనున్న ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ యూహెచ్ఎస్, ఏపీ డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరుకానున్నారన్నారు. సదస్సులో వక్తల విలువైన ఉపన్యాసాలతో పాటు, సైంటిఫిక్ పేపర్ల ప్రజెంటేషన్, ఇన్నోవేషన్స్ ఇన్ నర్సింగ్ ప్రాక్టీస్, ఇంపాక్ట్ ఆఫ్ నర్సింగ్ లీడర్స్ అంశాలపై ప్లీనరీ సెషన్లు నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన సుమారు 2400 మంది నర్సులు ఈ సదస్సులో పాల్గొంటారన్నారు.

కార్పొరేషన్‌లో ఏసీబీ తనిఖీలు

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లకు సంబంధించి టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఫైళ్లను పరిశీలించారు. ఎంత మేరకు టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. నిబంధనల ప్రకారమే మంజూరయ్యాయా? లేదా? వంటి అంశాలపై ఆరా తీశారు. అందుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు.

మలికిపురంలో ఉద్రిక్తత



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల అధ్యాపకులు ఆమరణ నిరాహారదీక్ష ప్రకటించడంతో శుక్రవారం మలికిపురంలో ఉద్రిక్తత నెలకొంది. దీక్ష ప్రకటన ప్రకటించిన నేపథ్యంలో కళాశాల యాజమాన్యం సమ్మె చేస్తున్న ఉద్యోగులకు జీతాలు పూర్తిగా వేసేసి, ఉద్యోగాలకు రావద్దని సూచించింది. అప్పటికే నిరాహార దీక్ష ప్రకటించిన అధ్యాపకులు జీతాలు వేయడంతో తొలుత ఉద్యోగాలలో చేరేందుకు వెళ్లారు. కానీ యాజమాన్యం అంగీకరించకపోవడంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. పోలీసులు అధిక సంఖ్యలో మోహరించడంతో పాటు మాజీ ఎమ్మెల్యే రాపాక వర్గీయులు కూడా అధిక సంఖ్యలో చేరుకున్నారు. చర్చలకు కరస్పాండెంట్ అందుబాటులో లేకపోవడంతో సీఐ నగేష్ కుమార్, ఎస్సై సురేష్‌లు ఇరుపక్షాల మధ్య చర్చలకు చర్యలు తీసుకున్నారు. ప్రిన్సిపాల్ తోరం సతీష్ సెలవుపెట్టి వెళ్లిపోయారు. ప్రస్తుతం కళాశాలలో పోస్టులు ఖాళీగా లేవని, తర్వాత తెలియజేస్తామని యాజమాన్యం చెప్పింది.

ఈ మేరకు వైస్ ప్రిన్సిపాల్ ఆనంద మహాసీ లెటర్ అందజేశారు. అయితే దాన్ని తమకు పోస్టులో పంపాలని అధ్యాపకులు కోరారు. అందుకు అంగీకరించడంతో నిరాహార దీక్షను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు తెలిపారు. దీంతో రిలేదీక్ష యథాతథంగా సాగింది.

క్లుప్తంగా

రెండు తాటాకిళ్లు దగ్ధం



పెంటపల్లిలో కాలిపోయిన ఇంటి వద్ద బాధితులు

గోకవరం: మండలంలోని పెంటపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదాల్లో రెండు తాటాకిళ్లు కాలిపోయాయి. మూడు కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. పెంటపల్లి భగీరథ కాలనీలో కొండ చిన్నకృష్ణ, వెంకట రమణ దంపతుల తాటాకిల్లుకి అర్ధరాత్రి సమయంలో నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రితో పాటు బీరువాలో ఉంచిన రూ.80 వేలు కాలిపోయాయని బాధితులు వాపోయారు. అలాగే కొత్తపల్లి గ్రామంలో తాటాకిల్లుకి నిప్పంటుకుని గండేపల్లి మంగయ్యమ్మ, బొజ్జపు లక్ష్మి కుటుంబాలకు నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

ఆలమూరు: మోదుకూరు గ్రామానికి చెందిన తాతపూడి రోహిత్ (13) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రైవేట్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న రోహిత్ ఈ నెల 29న తన ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడిని కుటుంబ సభ్యులు కాకినాడ సామాన్య ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. స్కూల్ యాజమాన్యం వేధింపుల వల్లే తమ బిడ్డ ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక రైళ్ల రాకపోకలు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికుల రద్దీని అనుసరించి 16 జనసాధారణ్ అన్ రిజర్వ్డ్ రైళ్లను విజయవాడ – విశాఖపట్నం మధ్య నడుపుతున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఇవి ఈ నెల 1, 3, 4, 6, 8, 10, 11, 13 తేదీలలో రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవం



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాముని తిరునక్షత్ర ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏర్పాట్లను దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షించారు.

పండగ రోజు పెనువిషాదం

- శలపాకలో ముగ్గురి దారుణ హత్య
- కుటుంబ తగాదాలే కారణం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



దాడి ఘటనపై శలపాకలో స్థానికులను విచారణ చేస్తున్న పోలీసులు

కాజులూరు: దీపావళి పండగను అందరూ ఉత్సాహంగా జరుపుకొంటున్న వేళ.. ఆ గ్రామంలో మృత్యువు తాండవం చేసింది. బాణసంచా వెలుగులు విరజిమ్మాల్సిన సమయంలో రక్తం పారింది. గ్రామ ప్రజలందరూ బిక్కుబిక్కుమంటూ తెల్లవార్లూ కాలం గడిపారు. కాజులూరు మండలం శలపాకలో గురువారం రాత్రి ఈ విషాద సంఘటన జరిగింది. గ్రామంలోని చిన్నపేటకు చెందిన పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఎదుట ఇంటిలో ఉంటున్న బత్తుల చిన్నయ్య, అతడి కుమారుడు రమేష్, సోదరులు రాజు, శ్రీనుపై ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో బత్తుల చిన్నయ్య (56), బత్తుల రాజు (49), బత్తుల రమేష్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. బత్తుల శ్రీను తీవ్ర గాయాలతో అక్కడి నుంచి పారిపోయాడు.

అసభ్యకర ప్రవర్తనే కారణం

పొట్లకాయల నాగేశ్వరరావు భార్య బేబీని బత్తుల చిన్నయ్య కొంత కాలంగా దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయంపై చిన్నయ్యను పలుమార్లు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు మందలించినా అతడిలో మార్పు రాలేదు. దీపావళి రోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో గ్రామస్తులందరూ బాణసంచా కాల్చుకుంటూ పండగ చేసుకుంటున్నారు. ఆ సమయంలో మద్యం తాగి వచ్చిన చిన్నయ్య మరోసారి నాగేశ్వరరావు భార్యపై అభ్యంతరకరంగా మాట్లాడటం ప్రారంభించాడు. దీంతో నాగేశ్వరరావు, అతడి భార్య బేబీ, కుమారులు సుబ్రహ్మణ్యం, దొరబాబు, వినోద్ కుమార్ విసుగు చెంది బత్తుల చిన్నయ్యపై దాడి చేశారు. అడ్డుగా వచ్చిన అతడి కుమారుడు, సోదరులను విచక్షణా రహితంగా కొట్టారు. ఆ సమయంలో గ్రామంలో విద్యుత్ పోవడంతో ఎవరు ఎవరిపై దాడి చేస్తున్నారో కూడా స్థానికులకు అర్థం కాలేదు.

పరారీలో ముగ్గురు నిందితులు

విద్యుత్ వచ్చే సరికి చిన్నయ్య, రాజు, రమేష్ మృతదేహాలు వీధిలో చెల్లాచెదురుగా పడిఉన్నాయి. విషయం తెలుసుకున్న గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్ కుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితులు పొట్లకాయల నాగేశ్వరరావు, అతడి కుమారుడు సుబ్రహ్మణ్యాన్ని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్, పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి, 144 సెక్షన్ అమలు చేశారు.

తారాజువ్వ పడి డ్రిప్ పైపుల దగ్ధం



లారీలో కాలిపోయిన డ్రిప్ పైపులు

గోపాలపురం: దీపావళి సందర్భంగా తారాజువ్వ పడడంతో డ్రిప్ పైపులు కాలిపోయాయి. వేళ్ల చింతలగూడెంలో శ్రీనివాస్ అనే రైతుకు లారీలో డ్రిప్ పైపుల లోడు వచ్చింది. మర్నాడు ఉదయం వాటిని అన్‌లోడ్ చేద్దామని అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తారాజువ్వ లారీ పడి డ్రిప్ పైపులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

వెంటాడిన మృత్యువు

- స్కూటీని ఢీకొన్న ట్యాంకర్
- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు



స్వర్ణలత (ఫైల్)



గాయపడిన సతీష్ కుమార్

గండేపల్లి: దీపావళి రోజు రాజమహేంద్రవరంలో ఆనందంగా గడిపి తిరిగి వస్తున్న ఆ దంపతులను మృత్యువు వెంటాడింది. మరికొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకునేలోపు ట్యాంకర్ రూపంలో కబలించింది. ఈ ఘటనలో భార్య చనిపోగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన తాడి సతీష్ కుమార్ స్థానిక దేవీ సెంటర్‌లో ఫాస్ట్‌ఫుడ్ షాపు నిర్వహిస్తున్నాడు. దీపావళి సందర్భంగా గురువారం సెలవు కావడంతో భార్య స్వర్ణలత (24)ను తీసుకుని స్కూటీపై రాజమహేంద్రవరం వెళ్లాడు. వీరి 16 నెలల పాప అమ్మ క్రిస్టిని ఇంటి దగ్గర కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజమహేంద్రవరంలో సరదాగా గడిపి, రెస్టారెంట్లో భోజనం ముగించుకుని ఇంటికి బయలుదేరారు. మురారి బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలోకి వచ్చేసరికి మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో విశాఖ వైపు వెళుతున్న భారత్ పెట్రోలియం ట్యాంకర్ వీరి స్కూటీని ఢీకొంది. భార్యాభర్తలిద్దరూ రోడ్డుపై పడిపోగా స్వర్ణలత తలపై నుంచి ట్యాంకర్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సతీష్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఎస్సై యూవీ శివనాగబాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్వర్ణలత మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. సతీష్ కుమార్‌ను జగ్గంపేటలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీపీ చలగళ్ల దొరబాబు ప్రమాద స్థలానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సతీష్ కుమార్ తండ్రి తిరుమలరావు ఏడాది క్రితం మృతి చెందారు. తల్లి ఉదయ భాను, తమ్ముడు సురేష్‌తో కలిసి సతీష్ కుమార్ కుటుంబం నివసిస్తోంది. ప్రమాద సమయంలో డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా.. అమ్మక్రిస్టి 16 నెలలకే తల్లి ప్రేమకు దూరం కావడంతో బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పనికి వెళ్లి.. శవమై తేలింది..

- మహిళా కూలీపై యువకుల ఘాతుకం
- అత్యాచారం, ఆపై హత్య చేసిన దుర్మార్గులు
- నిందితుల అరెస్టు



రౌతు కస్తూరి (ఫైల్)

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక గ్రామానికి చెందిన రౌతు కస్తూరి (43)ని నలుగురు యువకులు సామూహిక అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది. దీనికి సంబంధించి దక్షిణ మండలం డీఎస్పీ భవ్య కిశోర్ స్థానిక విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. కస్తూరి అక్టోబర్ 16వ తేదీన నర్సరీలో కూలి పనికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో 17వ తేదీన కడియం పోలీస్ స్టేషన్‌లో ఆమె భర్త పాపారావు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చొప్పెల్ల లాకుల వద్ద శరీరంపై అరకొర దుస్తులతో ఉన్న మహిళ మృతదేహం లభించింది. అదృశ్యమైన కస్తూరిదే ఆ మృతదేహం అని కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సీసీ కెమెరాల పరిశీలన

కస్తూరి పనికి వెళ్లిన నర్సరీకి సమీపంలోని సీసీ కెమెరాలను గమనించగా, ఆమె పనికి వెళుతున్నట్లుగా అందులో నమోదైంది. కానీ తిరిగి రాలేదు. దీంతో సమీపంలోని నర్సరీల్లో రైతులు, కూలీలను పోలీసులు విచారించారు. కస్తూరి పనిచేసే నర్సరీ పక్కనే గల మరో నర్సరీలో పనిచేసే దేవర ఏసు.. ఆమె అదృశ్యమైనప్పటి నుంచి కన్పించడం లేదని గుర్తించారు. దీంతో అతడి కదలికలపై నిఘా పెట్టి పట్టుకున్నారు.

మద్యం మత్తులో..

బుర్రిలంక గ్రామానికి చెందిన దేవర ఏసు, వెలుబుడి ప్రవీణ్, లోకిన జయప్రసాద్, పొట్టిలంక గ్రామానికి చెందిన దాసరి సురేష్ 16వ తేదీ సాయంత్రం 5.30 సమయంలో మద్యం తాగుతున్నారు. అదే సమయంలో పని ముగించుకుని ఇంటికి బయలుదేరిన కస్తూరిని కాళ్లుచేతులూ పట్టుకుని మొక్కల మధ్యకు లాక్కుని వెళ్లి సామూహికంగా అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను హత్య చేసి కోటిపల్లి కాలువలోకి మృతదేహాన్ని విసిరేశారు. కాగా.. కేసులో నిందితులైన నలుగురినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ భవ్య కిశోర్ తెలిపారు. వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి, తగు చర్యలు చేపడతామన్నారు.



బుర్రిలంకలో జనసేన నాయకుడి ఇంటి వద్ద బాధితులతో చర్చిస్తున్న డీఎస్పీ భవ్య కిశోర్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

పోలీసుల తీరుపై విమర్శలు

రౌతు కస్తూరి కేసు దర్యాప్తులో పోలీసు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రా సరిహద్దు ప్రాంతం నుంచి పొట్టపోసుకునేందుకు కడియం నర్సరీల్లో పనికి వచ్చిన కస్తూరి కుటుంబానికి న్యాయం చేయాలంటూ వలస కూలీలు ఆందోళనకు సిద్ధమయ్యారు. వారంతా కడియం పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపేందుకు సన్నాహాలు చేపట్టారు. ఈలోపు బుర్రిలంక గ్రామానికి చెందిన జనసేన నాయకుడి ఇంటి వద్ద గ్రామంలోని సుమారు 300 మందితో సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిశోర్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు, సిబ్బంది చర్చలు మొదలుపెట్టారు. ఈ విషయంపై జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ కస్తూరి కేసులో పోలీసులు అధికార పార్టీకి వంతపాడుతున్న ట్లుగా ఉందన్నారు. బాధితులతో చర్చించడానికి ప్రభుత్వ భవనాలు కనిపించకపోవడం విడ్డూరమన్నారు.

దళిత యువకులపై దాడి

- ఆలయంలో ఇద్దరి నిర్బంధం
- దుశ్చర్యకు పాల్పడిన అగ్రవర్ణాల యువకులు
- ఘటనపై దళిత నాయకుల ధర్నా
- ఎనిమిది మందిపై కేసు



మండపేట పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించిన దళిత సంఘాల నాయకులు

మండపేట: సినిమా థియేటర్‌లో పార్క్ చేసిన బైక్ పడిపోవడంతో తలెత్తిన స్వల్ప వివాదం కొట్లాటకు దారి తీసింది. ఆగ్రహించిన అగ్రవర్ణాల వారు దళితులపై దాడికి దిగి ఇద్దరిని బలవంతంగా తమ స్వగ్రామానికి తీసుకువెళ్లి గుడిలో నిర్బంధించారు. దాడికి పాల్పడిన వారిలో జనసేన నాయకులు కూడా ఉన్నారు. దీంతో ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నాయకులు పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. పోలీసులు రంగంలోకి దిగి నిర్బంధించిన వారిని విడిపించడమే కాకుండా, ఎనిమిది మంది అగ్రవర్ణాల వారిపై కేసులు నమోదు చేశారు. గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

బైక్ విషయంలో..

మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన కొందరు యువకులు గురువారం మండపేటలోని సత్యశ్రీ థియేటర్‌లో మార్నింగ్ షోకు వెళ్లారు. తాము వేసుకొచ్చిన పల్సర్ బైకును పార్కింగ్‌లో ఉంచారు. మేట్నీ చూసేందుకు పట్టణానికి చెందిన పది మంది రెల్లి కులస్తులు ముందుగానే ఆ థియేటర్‌కు వచ్చారు. వారిలో ఓ మహిళ పల్సర్ బైక్‌పై కూర్చోవడంతో అనుకోకుండా ఆ బైక్ కింద పడిపోయింది. ఆమె అన్నయ్య బొచ్చా మోహన్ కిరణ్ ఆ బైక్‌ను పైకి లేపి యథాస్థానంలో ఉంచి సినిమాకు వెళ్లారు. మార్నింగ్ షో నుంచి వచ్చిన బైక్ తాలూకా యువకులు తమ బైక్ డ్యామేజ్ అయినట్టు గుర్తించారు. దీనిని ఎవరు పడేశారో తెలుసుకుని మేట్నీ షో ఇంటర్వెల్ వరకూ నిరీక్షించారు. ఈలోపు బయటకు వచ్చిన మహిళను నిలదీసి డ్యామేజీకి మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. ఆమె ఒప్పుకోవడంతో గుమ్మిలేరు రోడ్డులోని ఓ షోరూమ్‌కు బైక్‌ను తీసుకువెళ్లారు. ఈలోపు బైక్ యజమానులకు, పడేసిన వారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ దాడిలో తొలుత ఏడిద గ్రామానికి బైక్ యజమాని కింద పడిపోవడంతో తన స్నేహితులకు కబురు పంపాడు. ఆ గ్రామం నుంచి కొంతమంది యువకులు మండపేట షోరూమ్ వద్దకు చేరుకోవడంతో గొడవ పెద్దదై కొట్టుకున్నారు.



గాయపడిన దళిత యువకుడు శేఖర్

మండపేట పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన

ఈ ఘర్షణలో బొచ్చా మోహన్ కిరణ్, కొల్లి చంటి, పాలపర్తి చంద్రశేఖర్ అనే దళిత యువకులు గాయపడ్డారు. వారిలో పాలపర్తి శేఖర్, కొల్లి చంటిలను బైక్ యజమాని వర్గీయులు తమతో ఏడిద తీసుకువెళ్లిపోయారు. గ్రామంలోని వినాయకుని ఆలయంలో వారిని నిర్బంధించి అక్కడున్న అగ్రవర్ణ యువకులందరూ దాడి చేశారు. కాగా.. షోరూం దగ్గర జరిగిన గొడవలో బాధితుడైన కిరణ్ ఆ విషయాన్ని తమ పెద్దలకు తెలియజేశాడు. దీంతో ఎమ్మార్పీఎస్ నాయకుడు దూలి జయరాజు, మాలమహానాడు నాయకులు వెంటపల్లి జాన్‌మార్క్, పాలపర్తి సురేష్ కన్నా, కొవ్వాడ అప్పన్న బాబు, సీఐటీయూ నాయకురాలు కె.కృష్ణవేణి తదితరులు మండపేట పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని తమకు న్యాయం చేయాలని ధర్నా చేశారు. వారికి ఎస్సై హరికోటి శాస్త్రి సర్దిచెప్పారు. దీనిపై సీఐ దొరరాజు మాట్లాడుతూ ఘటనపై విచారణ చేపట్టామని, తక్షణ చర్యల్లో భాగంగా 8 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. దాడి చేసిన అగ్రవర్ణ నిందితుల్లో జనసేన పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

మద్యం షాపు వద్దని ఆందోళన



మద్యం షాపు ఏర్పాటుకు నిర్మాణాలు చేస్తున్న చోట నినాదాలు చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని వెల్ల గ్రామం శివారు వెల్లసావరం గ్రామానికి వెళ్లే రహదారి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును దూరంగా తరలించాలని శుక్రవారం టీడీపీ, జనసేన కార్యకర్తల ఆధ్వర్యంలో మహిళలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు, గ్రామస్తులు ధర్నా చేశారు. వెల్ల, వెల్లసావరం, గొల్లలచెరువు, అరుంధతి పేట, కందులపాలెం, ఆదివారపుపేట తదితర గ్రామాల నుంచి విద్యార్థినులు ఇదే రహదారిలో వెల్ల జెడ్పీ హైస్కూల్, రామచంద్రపురంలోని వివిధ కళాశాలలకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో టీడీపీ మండల యూనిట్ ఇన్‌చార్జి చింతలపూడి కిరణ్ కిశోర్, బూత్ ఇన్‌చార్జి వాసా బసవకుమార్, నూకెళ్ల భవాని శంకర్, జనసేన కార్యకర్తలు గాడా దుర్గాప్రసాద్, బంటు కాశీభగవాన్, కురసాల సుబ్బారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ కానిస్టేబుల్‌ను పంపించి విచారణ చేయించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

జగ్గంపేట: దీపావళి బాణసంచా విషయంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదం ఘర్షణకు దారి తీసింది. రాళ్లు, కర్రలతో దాడి చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజపూడి గ్రామంలో ఒక వర్గం వారు దీపావళి బాణసంచా కాల్చుతున్నారు. అయితే ఇంటిలో చంటి పిల్లలు ఉన్నారు, కాల్చవద్దంటూ మరో వర్గం వారు అభ్యంతరం చెప్పారు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. రాళ్లు, కర్రలతో దాడి చేసుకోవడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. వారిని జగ్గంపేట సీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం



శివ (ఫైల్)

కడియం: జేగురుపాడు శివాలయం వీధికి చెందిన 30 ఏళ్ల వి.శివ అదృశ్యమయ్యాడు. అతడు గత నెల 29వ తేదీన పుట్టినరోజు ఫంక్షన్‌కు వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పారు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు కడియం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆకాశవాణిలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్, క్యాజువల్ బ్రాడ్ కాస్ట్ అసిస్టెంట్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ వార్తా విభాగాధిపతి వెంపాటి సాయి తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇవి క్యాజువల్ నియామకాలని, శాశ్వత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు కావన్నారు. పీఎఫ్, ఆరోగ్య పథకం, క్వార్టర్లు, పెన్షన్ వంటి ప్రయోజనాలు ఉండవని స్పష్టం చేశారు. క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్ (తెలుగు) నియామకానికి అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, ఆంగ్లం నుంచి తెలుగులో తర్జుమా చేయగల నైపుణ్యం, మంచి స్వరం కలిగి, రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలన్నారు. తెలుగు టైపింగ్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు. క్యాజువల్ బ్రాడ్ కాస్ట్ అసిస్టెంట్ నియామకానికి అభ్యర్థులకు రేడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ లేదా డిప్లమో అర్హత కలిగి ఉండాలన్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం, ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం అవసరమన్నారు. 21 నుంచి 50 ఏళ్ల వయస్సు, విశాఖపట్నం ప్రాంతంలో నివసించే వారు అర్హులన్నారు. క్యాజువల్ విధానంలో నియమింపబడిన వారికి అసైన్‌మెంట్ ప్రాతిపదికన విధుల కేటాయింపు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94406 74057 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

గడ్డివామి దగ్ధం



గొల్లవిల్లిలో కాలిపోతున్న గడ్డివామి

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో మధుర బాబులుకు చెందిన గడ్డివామి శుక్రవారం తెల్లవారుజామున కాలిపోయింది. గ్రామానికి చెందిన జి.రాముడు తన గడ్డివామికి నిప్పు పెట్టాడని బాబులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని బీఎస్పీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు సందర్శించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సీహెచ్ రాజేష్ తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌లో బెల్ట్ షాపు

- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం విక్రయాలు
- ప్రశ్నించిన వ్యక్తిపై దాడి



వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌పేటలోని కిళ్లీబడ్డీలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపు

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామ పరిధిలోని ఒక మద్యం దుకాణ లైసెన్సుదారుడు మత్స్యకారులు అధికంగా ఉండే ఫిషింగ్ హార్బర్‌లో బెల్ట్ షాపు ద్వారా శుక్రవారం అమ్మకాలు ప్రారంభించాడు. ఎమ్మార్పీ కంటే రూ.10 అధికంగా విక్రయాలు చేపడుతున్నా ఎక్సైజ్, సివిల్ పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. వాకలపూడి ఫిషింగ్ హార్బర్ ఎక్సైజ్ నార్త్ స్టేషన్ పరిధిలోకి, పోలీసు పరంగా సర్పవరం స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ వేలంపాట ద్వారా బెల్ట్ షాపు కేటాయింపు చేస్తున్నారని కొన్ని రోజులుగా ప్రచారం జరిగింది. స్థానికంగా వ్యతిరేకత రావడంతో కొన్ని రోజులు పాటు వేచి ఉండి శుక్రవారం బెల్ట్ షాపు ఏర్పాటు చేసి, అదనపు ధరకు విక్రయాలు ప్రారంభించారు. వాకలపూడిలో మొత్తం రెండు మద్యం షాపులు ఉండగా సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణ దారుడు ఫిషింగ్ హార్బర్‌లో బెల్ట్ షాపు ఏర్పాటు చేసినట్టు స్థానికంగా చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం హార్బర్ పేటలోని బెల్ట్ షాపులో జరుగుతున్న మద్యం విక్రయాలపై ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ కార్యకర్త అప్పారావుపై మద్యం దుకాణదారుడి అండతో స్థానికంగా ఉన్న టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. అతడు వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. అనంతరం సర్పవరం స్టేషన్‌కు వెళితే ఫిర్యాదు తీసుకోలేదని బాధితుడు ఆరోపించాడు. కాగా.. హార్బర్‌పేటలో బెల్ట్ షాపు ఏర్పాటుపై ఎక్సైజ్ నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహన్ వివరణ కోరగా.. ఆ విషయం తమ దృష్టికి రాలేదని, తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి



రామచంద్రరావు (ఫైల్)

కాకినాడ రూరల్: సర్పవరం పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ముంగళ్ల రామచంద్రరావు (60) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్టేషన్ నుంచి తన ఇంటికి మోటారు సైకిల్‌పై వెళుతుండగా తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఆయనను అతివేగంగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ప్రమాద స్థలానికి సీఐ పెద్దిరాజు, సిబ్బంది చేరుకున్నారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా.. రామచంద్రరావు మరో 11 నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయనకు భార్య సుశీల, కుమారుడు విజయ శేఖర్, కుమార్తె అరవిందస్వామి ఉన్నారు.